క్లుప్తంగా

అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి


మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):రైతుల పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోన్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం నిర్వహించే అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రతిఒక్కరూ బీసెంట్ రోడ్డులోని పాత కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి ఎల్ఐసీ కార్యాలయం, మ్యూజియం వెనుక రోడ్డు నుంచి ప్రదర్శనగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుంటామని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ప్రధాన అజెండాగా.. అన్నదాతలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఆయన కోరారు.

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి ఉందని కళ్ళే లలిత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు తెలిపారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్ నగర్ రైతుబజార్ వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ తోటి వారికి సహాయం చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని తెలిపారు. మనకు ఉన్నదాంట్లోనే లేనివారికి సహాయపడడం గొప్ప విషయమన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 34 నెలల నుంచి పేదలకు అన్నదానం, వస్త్రదానం, ఆర్థిక సహాయం, వరద సమయాల్లో నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముందుగా ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణిలు పాల్గొని కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ సభ్యులు ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

29న శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ స్వర్ణోత్సవ వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యల వాడగా ప్రసిద్ధి చెందిన విజయవాడలో 'శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ' స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 29న స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి కుందా రామనారాయణ తెలిపారు. గురువారం స్థానిక శారదా కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 1974 లో ఉన్నతమైన ఆశయాలు, ఆదర్శాలతో సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలనే లక్ష్యంతో శారదా విద్యాసంస్థలు ప్రారంభించామని చెప్పారు. ఈ ఏడాదికి 50 సంవత్సరాల సుదీర్ఘకాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుందన్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా కళాశాల ప్రాంగణంలో పూర్వవిద్యార్థులు, పూర్వ అధ్యాపకులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనం వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల నెట్ వర్క్ బలోపేతం అవుతుందన్నారు. ఈ సమ్మేళనంలో పాల్గొనే పూర్వ విద్యార్థులు పూర్తి వివరాలకు డాక్టర్ కై లాసరావును 9440239989 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర శర్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనాట్యాంజలి కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు గురువారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై మాగులూరి త్రినాధచారి పర్యవేక్షణలో 12మంది కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు ఆలయ ఈవో కెఎస్.రామరావు అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

యూజీడీ అందుబాటులోకి వచ్చేదెప్పటికో..?

తుది దశలో నిలిచిపోయిన యూజీడీ పనులు

డివిజన్ వాసులకు తప్పని కష్టాలు


జీవీఆర్‌నగర్ యూజీడీ పంపింగ్ స్టేషన్


సంపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసులకు యూజీడీ కష్టాలు తప్పటం లేదు. ఇక్కడ ప్రజల అవసరాల మేరకు సుమారు 8 సంవత్సరాల క్రితమే అమృత్ పథకంలో భాగంగా యూజీడీ పనులు ప్రారంభించారు. అయితే యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేకపోవటంతో పనులు నత్తనడకన సాగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులు, రెసిడెన్సియల్ అసోసియేషన్ నేతలతో మాట్లాడి జీవీఆర్‌నగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్ సమీపంలో బుడమేరు పక్కన యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించటానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి వీధిలోనూ యూజీడీ పైపులైన్ పనులు పూర్తిచేశారు. అలాగే ప్రతి ఇంటికీ సైతం పైపులైన్ పనులు పూర్తిచేశారు. ముందుచూపుతో రోడ్లు తవ్వకుండా ఖాళీ స్థలాలకు సైతం యూజీడీ పైపులైన్‌లు వేయించారు. అలాగే యూజీడీ పంపింగ్‌స్టేషన్, సంపు పనులు సైతం వేగవంతం చేశారు. డివిజన్ వాసుల చిరకాల కోరికగా మిగిలిన యూజీడీ పంపింగ్‌స్టేషన్‌ను ఎన్నికలకు ముందే ప్రారంభించాలని పనిచేశారు. అయితే ఇక్కడ నుంచి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు వేళ్లే పైపులైన్ పనులకు రైల్వే అధికారుల నుంచి అనుమతి రాకపోవటంతో పాటు సాంకేతిక సమస్యలతో పంపింగ్ స్టేషన్ ప్రారంభం కాలేదు. ఇంతలో ఎన్నికలు రావటం ప్రభుత్వం మారటం జరిగింది. అలాగే అధికారులు సైతం బదిలీ అయ్యారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 90 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. తక్కిన పనులు పూర్తి చేసి యూజీడీ వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

యూజీడీ కష్టాలు....

ఇక్కడ యూజీడీ అందుబాటులోకి రాకపోవటంతో పాటు కనీసం మురుగుకాలువలు కూడ సక్రమంగా లేవు. దీంతో వర్షపునీరు మురుగునీరు పోయే మార్గం లేక ఇళ్ల మధ్యలో నిలిచిపోయి దుర్వాసన వెదజల్లటంతోపాటు దోమలకు ఆవాసకేంద్రంగా మారుతున్నాయి. బుడమేరు వరదల్లో సైతం యూజీడీ వ్యవస్థ, మురుగు కాలువలు లేకపోవటం వల్ల ఇక్కడ సుమారు 15 రోజులకు పైగా వరద నీరు నిలిచిపోయింది.

కార్పొరేషన్‌కు ఆదాయం

90శాతం పనులు పూర్తయినా ఇక్కడ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తే నగర పాలక సంస్థకు యూజీడీ ద్వారా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి ఇక్కడ పనులు వేగవంతం చేసి యూజీడీ పంపింగ్ స్టేషన్‌ను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు పోయే మార్గం లేదు



ఇక్కడ కనీసం వాడిన మురుగునీరు బయటకు పోయే మార్గం లేదు. యూజీడీ పంపింగ్ స్టేషన్ వినియోగంలోకి వస్తే మురుగు కష్టాలు తీరుతాయి. మురుగు, వర్షపునీరు నిలిచిపోవటం వల్ల దోమలు విజృంభిస్తున్నాయి.

–తోట రవి, దావు బుచ్చయ్యకాలనీ

చినుకుపడితే చిత్తడే



ఇక్కడ యూజీడీ , మురుగుకాలువలు లేకపోవటం వల్ల చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. ఖాళీ స్థలాల్లో మురుగు, వర్షపునీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రంగా మారుతున్నాయి. అధికారులు యూజీడీను వినియోగంలోకి తీసుకురావాలి.

–ఎస్‌కే నాగూర్ వలీ, జీవీఆర్‌నగర్

యూజీడీ లేకపోవడం లోటు



వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో యూజీడీ వ్యవస్థ లేకపోవటం పెద్ద లోటుగా మారింది. యూజీడీ పంపింగ్‌స్టేషన్ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలి. మురుగునీరు నిలిచిపోవటం వల్ల దోమలు పెరిగిపోయి తరచూ అనారోగ్యం బారిన పడాల్సి వస్తుంది.

–బాబూరావు, దావు బుచ్చయ్యకాలనీ

వాలీబాల్ టోర్నీతో నగరానికి క్రీడా శోభ


టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్

విజయవాడస్పోర్ట్స్: జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీతో విజయవాడకు క్రీడా శోభ సంతరించుకుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియంలో నాదేళ్ల బసవపూర్ణయ్య (ఎంబీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ గురువారం సాయంత్రం ప్రారంభమైంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఈ పోటీలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీ మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, తమిళనాడు క్రీడా ప్రాధికార సంస్థ, జేఈపీఏఐఆర్ యూనివర్సిటీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, పీకేఆర్ యూనివర్సిటీ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా టాప్ ప్లేస్‌లో ఉన్న 80 శాతం వాలీబాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని వివరించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు రూ.2.75 లక్షల నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


మందులు తీసుకుంటున్న కార్మికులు

పాయకాపురం(విజయవాడరూరల్):పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ మాధురి సూచించారు. గురువారం 62వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులకు మాతేర్ కన్సల్‌టెంట్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 55 మంది కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్, కంటి, దంత సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్సల్‌టెంట్ నిర్వాహకులు ఆసుల రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శివకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

దత్తసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు బాబాకు విశేషంగా అన్నాభిషేకం నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్వాములు పాల్గొని బాబావారి ప్రసాదం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

శోభాయమానంగా దాసాంజనేయస్వామి దేవాలయం

- సుందరంగా తీర్చిదిద్దిన ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్
- రూ. 35 లక్షల వ్యయంతో ముఖ మండపం పనులు


నూతనంగా నిర్మించిన దాసాంజనేయస్వామివారి దేవాలయ ముఖమండపం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ స్వయంభూ శ్రీ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయానికి 150 సంవత్సరాల చరిత్ర ఉంది. నిత్యం వేలాది మంది స్వామివారిని దర్శించుకోవటంతో పాటు పెద్ద సంఖ్యలోవాహన చోదకులు వాహన పూజలు చేయించుకుంటారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంను ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కనపర్తి కొండలరావు తన సొంత ఖర్చులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఎంతో చరిత్ర కలిగిన దేవాలయంలో ఇంత వరకు ఆలయంకు కనీసం ముఖ మండపం కూడా లేదు. ఆలయం బయట రేకులతోనే కొనసాగుతుంది. ఎంతో మంది ధర్మకర్తలు చైర్మన్‌లు వచ్చారు...వెళ్లారు. కానీ మాజీ ధర్మకర్తల చైర్మన్ కనపర్తి కొండలరావు రాకతో ఆలయ రూపు రేఖలు మారిపోయాయి. ఆలయ చైర్మన్ కనపర్తి కొండలరావు చొరవ తీసుకుని ముందుకు కదిలారు. వెంటనే వేద పండితులచే సంప్రదాయ బద్ధంగా ఆలయ ధ్వజ స్తంభాన్ని తన సొంత ఖర్చులతో పూర్తిచేయించారు. వెంటనే ముఖ మండపం కూడా పూర్తిచేయాలని భావించారు. ఇందుకుగానూ కొంత మంది దాతలు ముందుకు వచ్చినప్పటికీ తానే స్వంతంగా పూర్తిచేస్తానని రూ. 35 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయి. సుందరంగా తీర్చిదిద్దిన ముఖమండపంతో ఆలయం మరింత శోభాయమానంగా మారింది. ఆలయంకు ముఖమండపంతో పాటు, శిథిలావస్థకు చేరిన గరుత్మంతుని దేవాలయంను కళాత్మకంగా నిర్మించారు. ముఖమండపంను శ్రీరామ లక్ష్మణ సీతాదేవిలతో పాటు ఆదిశేషునిపై శయనిస్తున్న లక్ష్మీనారాయణ, శ్రీకృష్ణుడు వంటి విగ్రహాలు భక్తితత్వాన్ని పెంపొందించే విధంగా పూర్తిచేశారు. ప్రస్తుతం పనులు పూర్తయ్యి రంగులు మాత్రం వేయాల్సి ఉంది. ఆలయంకు ముఖమండపం నిర్మించటం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ముఖమండపంను ఏర్పాటు చేయటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వామివారు నాకు ఇచ్చిన అదృష్టం



ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నాకు అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు అవకాశం కల్పించారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించడం సంతోషంగా భావించాను. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన స్వయంభూ దాసాంజనేయస్వామివారి దేవాలయంకు ముఖమండపం లేకపోవటం లోటుగా అనిపించింది. ఇంతలో ధ్వజస్తంభం గాలి, వర్షాలకు పాడవ్వటంతో నూతన ధ్వజస్తంభంతో పాటు ముఖమండపం పనులు చేపట్టాము. స్వామివారి ఆశీస్సులతో ఎంత ఖర్చయినా వెనుకాడకుండా పనులు పూర్తిచేయాలని నిర్ణయించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇది స్వామివారు నాకు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నాను.

–కనపర్తి కొండలరావు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్


బెలూన్‌లు ఎగురవేస్తున్న డీఆర్ఎం తదితరులు


విద్యార్థులల క్రీడా విన్యాసాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):విద్యార్థులు విద్యతోపాటు క్రీడలను జీవితంలో అంతర్భాగంగా మలచుకోవాలని రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ పిలుపునిచ్చారు. కేంద్రీయ విద్యాలయ నెంబర్ వన్‌లో గురువారం 37వ క్రీడా వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయంలో క్రీడాకారులు భవిష్యత్తులో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. తొలుత ప్రిన్సిపల్ ఆదిశేష శర్మ స్వాగత ఉపన్యాసం చేయగా వ్యాయామ ఉపాధ్యాయుడి టి.ఏడుకొండలు వార్షిక నివేదిక సమర్పించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక క్రీడా విన్యాసాలు ప్రదర్శించారు. విద్యార్థులు మార్చ్ పాస్ట్ చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. వార్షిక క్రీడా దినోత్సవం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల గౌరవ వందనంను నరేంద్ర ఏ పాటిల్ స్వీకరించి బెలూన్‌లను గాలిలోకి వదిలారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులు ఆస్తిక్ (ఆర్చరీ), ధీరజ్ (స్కేటింగ్), శ్రీ అంగీత (అర్చరీ), అబిరామ్ (స్కేటింగ్), దీరజ్ (స్కేటింగ్), ఈక్షిత (స్కేటింగ్), లక్ష్మీనారాయణ (స్కేటింగ్), జాన్సన్ (స్విమ్మింగ్), మనోహర్ (స్కేటింగ్) ను డాక్టర్ కిరణ్ కుమార్ రైల్వే డిపార్ట్‌మెంట్ ఏపీవో అనిరుద్ అభినందించారు.

జక్కంపూడి రైతులకు న్యాయం చేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతిన మహేష్


రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న పోతిన మహేష్

విజయవాడరూరల్: ల్యాంకో, మేఘ సంస్థలకు వందలాది కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతిన మహేష్ ఆరోపించారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలో రైతుల పొలాల్లో అక్రమంగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ల పనులను బాధిత రైతులు, ప్లాట్ల యజమానులతో కలిసి పోతిన మహేష్ గురువారం పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన చోట్ల హైటెన్షన్ వైర్స్ లైన్స్ క్రాస్ చేయాల్సి ఉందన్నారు. లైన్ మార్పు చేస్తున్నామని, ఏ రైతు పొలం పోతుందో కనీసం అధికారులు నోటిఫికేషన్ లేదా పేపర్ ప్రకటన ఇవ్వలేదన్నారు. రైతుల నుంచి భూములు లాక్కోవాలనే ప్రయత్నం చాలా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమా, ఎంపీ కేశినేని చిన్ని రైతుల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామసభలు బాగా జరిగాయని చెప్పినా జక్కంపూడి రైతుల పీకల మీద కత్తి పెడుతున్నామని ఎందుకు చెప్పలేదన్నారు. కలెక్టర్ రైతులతో కమిటీ వేయాలని, చర్చించి తర్వాత నిర్ణయం తీసుకోవాలన్నారు. రైతులు, ప్లాట్ల యజమానులకు ముఖ్యమంత్రి చంద్రబాబు న్యాయం చేయాలన్నారు.

రూ.లక్షల్లో వ్యయం.. లక్ష్యం శూన్యం..



లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి సేవలు అందించేందుకు గత ప్రభుత్వం కృషి చేస్తే కూటమి ప్రభుత్వం లక్ష్యాన్ని నీరు గార్చే విధంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొబైల్ వాహనాల ద్వారా హెచ్ఐవీ పరీక్షలతో పాటు, పాజిటివ్ బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఈ ఏడాది జనవరిలో ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో 15 ఐసీటీఎస్ వాహనాలు కొనుగోలు చేశారు. వాటి రిజిస్ట్రేషన్స్ పూర్తి చేసి, ప్రారంభించే నాటికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో సిద్ధార్థ వైద్య కళాశాలలో వాహనాలు పార్కింగ్ చేశారు. ఎన్నికల అనంతరం కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. దీంతో వాహనాలు ప్రారంభించకుండానే తుప్పపట్టే స్థితికి చేరాయి. ఆధునిక వసతులు ఉన్న ఒక్కో వాహనం సుమారు రూ. 30 లక్షల వరకూ వ్యయం ఉంటుంది. ఆ లెక్కన 15 వాహనాలు రూ.4.50 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసినా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి ఎంతో ఉపయోగకరమైన ఆ వాహనాలు వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

–లబ్బీపేట(విజయవాడతూర్పు)

జాబ్‌మేళాలో 36 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేకేసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ మేళాలో 36 మందిని ఎంపిక చేశారు. కోస్టల్ న్యూమాటిక్ ఏజెన్సీలు, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వారికి అవసరమైన అభ్యర్థులను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసుకున్నారు. మొత్తం 43 మంది హాజరుకాగా వారిలో 36 మందిని కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు, జి. విజయదీప్ అభినందించారు.

రక్షణ సైన్యం ప్రార్థన మందిరం ప్రారంభం


రక్షణ సైన్యం ప్రార్థన మందిరం ప్రారంభిస్తున్న గొట్టుముక్కల రఘురామరాజు

మధురానగర్(విజయవాడసెంట్రల్):రామకృష్ణాపురం బుద్దంరాజు వీధిలో నూతనంగా నిర్మించిన రక్షణ సైన్యం ప్రార్థన మందిరంను గురువారం బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో రక్షణ సైన్యం విజయవాడ డివిజనల్ కమాండర్ మేజర్ టి పాల్ కుమార్, మేజర్ ఎరుషలేము, విశ్వాసకులు, శేషంరాజు పెద్ద సంఖ్యలో విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

● ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలను నిర్వహించగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. స్వామికి విశేష అభిషేకాలు చేశారు.